క్లుప్తంగా

సన్నబియ్యం పంపిణీ పేదలకు వరం



నేత కార్మికుడి ఇంట్లో భోజనం చేస్తున్న వెల్ముల స్వరూపరెడ్డి, కాముని వనిత

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం వరం లాంటిదని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బీవైనగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేశారు. గత ప్రభుత్వ హయాంలో దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే అవి విక్రయించారని, కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తే పేదలంతా కడుపునిండా భోజనం చేస్తున్నారన్నారు. సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు మడుపు శ్రీదేవి, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, సామల రోజా, సుధ, ఎండీ కాజా పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం నూకలమర్రిలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు విప్‌ను ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సామ తిరుపతిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పాలకుర్తి పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

కథల పోటీల్లో ప్రతిభ



శృతిక

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎల్లాని శృతిక కథల పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట లక్ష్మణ్ గురువారం తెలిపారు. మాచిరాజు కామేశ్వర్‌రావు జాతీయస్థాయి కథల పోటీలను ఇటీవల నిర్వహించారన్నారు. జిల్లా నుంచి శృతిక రాసిన ‘పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం’ కథ ఎంపికైనట్లు తెలిపారు. 35 కథలను ఎంపిక చేయగా, అందులో శృతిక రాసిన కథ కూడా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో త్వరలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నగదుతోపాటు శృతికను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. శృతికను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

త్వరలోనే 30 పడకల ఆస్పత్రి


సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరు పడకలతో అన్నిరకాల వైద్య సేవలు అందిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని మెరుగైన వైద్య సేవలు రోగులకు అందుతాయని జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి పెంచలయ్య తెలిపారు. ‘సాక్షి’ గురువారం ప్రచురితమైన ‘సర్కార్ వైద్యం.. పేదలకు దైన్యం’ కథనానికి వైద్యాధికారులు స్పందించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో నలుగురు వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇద్దరు డిప్యూటేషన్‌పై వైద్యం చేస్తున్నారన్నారు. త్వరలోనే 30 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో మరిన్ని సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య

వేములవాడఅర్బన్: పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇటీవల ప్రకటించిన 5వ తరగతి గురుకుల ప్రవేశ ఫలితాల్లో మోతె అనన్య, శివరాత్రి శ్రావణి ఉత్తమ ఫలితాలను సాధించి బీసీ వెల్ఫేర్ బాలనగర్ పాఠశాలలో గురుకుల సీట్లు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

మూడు కాళ్ల కోడి..



మూడు కాళ్ల కోడిని చూపుతున్న లక్ష్మణ్

తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లెలో వింత చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అనిరెడ్డి రాజిరెడ్డికి చెందిన పౌల్ట్రీఫాంను లక్ష్మణ్ అనే వ్యక్తి లీజుకు తీసుకొని కోళ్లను పెంచుతున్నాడు. గురువారం కోళ్లకు దానవేస్తుండగా ఓ కోడికి మూడు కాళ్లు ఉండడాన్ని గమనించాడు. ఈ విషయం గ్రామంలో తెలియడంతో మూడు కాళ్ల కోడిని చూసేందుకు జనాలు ఎగబడ్డారు.



కోనరావుపేట : కల్యాణం తిలకిస్తున్న భక్తులు



కోనరావుపేట : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వైభవంగా రాములోరి బ్రహ్మోత్సవాలు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య హోమం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీతారాములవారిని శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈనెల 13న గరుడ సేవోత్సవం, 14న రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

కోనరావుపేట: మండలంలోని మల్కపేట రామాలయంలో వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు, శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ నిర్మాత, మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు ఆధ్వర్యంలో అహోబిలం జీయర్ స్వామి చేతుల మీదుగా స్వామివారి కల్యాణం జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు, చల్మెడ ఆనందరావు, కుటుంబ సభ్యులైన చల్మెడ వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ జెడ్పీ చైర్మన్ అరుణా రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రాజు, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్లు రాంమోహన్‌రావు, అన్ని మండలాల అధ్యక్షులు, నాయకులు, భక్తులు, పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



గంభీరావుపేట: శేష వాహనంపై స్వామివార్లు

మామిడిపల్లిలో..

మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. చతుస్థానార్చన, పంచసూక్త హవనం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు తిరునహరి కృష్ణస్వామి, లక్ష్మణస్వామి, జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, భక్తులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశమైన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడ: లాడ్జిల్లోకి వచ్చేవారి పూర్తి వివరాలు తప్పకుండా నమోదు చేయాలని, సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి లాడ్జి నిర్వాహకులు, యజమానులకు సూచించారు. పట్టణ పరిధిలోకి లాడ్జి యజమానులతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లాడ్జిల్లో అసాంఘిక కార్యాలపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పోలీస్‌శాఖ ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. ఎవరైన కొత్తవారు, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో టౌన్ సీఐ వీరప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ముస్తాబాద్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ తలారి రాణి

సిరిసిల్లటౌన్: కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని సిరిసిల్ల ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి అన్నారు. పట్టణంలోని వీలిన గ్రామం చంద్రంపేటలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగ్, డైరెక్టర్లు వెంకటేశం, జగన్, వార్డు నాయకులు నూనె శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అప్పగించినట్లు పోతుగల్ ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి అన్నారు. చిప్పలపల్లి, గూడూరు, మొర్రాపూర్ తండాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్‌పర్సన్ ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ వెల్ముల రామ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గాడిచర్ల దేవయ్య, రమేశ్, జ్యోతి, ఏపీఎం దేవరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని మండల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్ అన్నారు. పెద్ద లింగాపూర్, సిరికొండ, తెనుగువానిపల్లి, దాచారం, అనంతగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కే భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ ఎంఏ ఫారూఖ్, ఏపీఎం వాణిశ్రీ, ఏఎంసీ డైరెక్టర్లు వెంకటరెడ్డి, తదితరులున్నారు.

సాగునీటి తిప్పలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న కడారి రాములు

రుద్రంగి: వరద కాలువలు తవ్వినా రైతులకు పంటల సాగులో సాగునీటి ఎద్దడి తప్పడం లేదని, సాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీపీఐ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు డిమాండ్ చేశారు. మండలంలో సీపీఐ పార్టీ గ్రామశాఖల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అర్హులైన పేదలకు స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5.50 లక్షలు లోన్ ఇవ్వాలన్నారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచి జిల్లాలో రూ.5 కోట్ల భారం ప్రజలపైన మోపిందన్నారు. ముందుగా సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రుద్రంగి శాఖ కార్యదర్శిగా కోల రెడ్డి, సహాయ కార్యదర్శిగా రాగులు మల్లేశం, రెండవ శాఖ కార్యదర్శిగా దరిపెల్లి భూమయ్య, సహాయ కార్యదర్శిగా గండి గంగాధర్ ఎన్నికయ్యారు. సీపీఐ శ్రేణులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం..

- ప్రియుడిపై కేసు నమోదు

ముస్తాబాద్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను మోసంచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన లకావత్ సుధాకర్ మండలంలోని ఓ బాలికను కొన్ని రోజులుగా ప్రేమిస్తున్నానని, పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. వీరి విషయం తల్లిదండ్రులకు తెలియడంతో, పెళ్లి చేసుకోవాలని యువతి బంధువులు ఒత్తిడి తెచ్చారు. పెళ్లికి సుధాకర్ ఒప్పుకోకపోవడంతో పంచాయతీ నిర్వహించి కొంత నష్టపరిహారం ఇవ్వాలని సూచించారు. అయితే తనకు న్యాయం చేయాలని బాధిత యువతి, కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పెద్ద మనుషుల పాత్రపై కూడా విచారణ చేపట్టనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హన్‌మాన్ ఆలయంలో చోరీ

- హుండీ డబ్బులు అప్పగించాలని డప్పు చాటింపు

ముస్తాబాద్: గుడిలో దొంగతనం చేసింద్రంట.. హుండీల పైసలు ఎత్తుకపోయినోళ్లు.. గుడిలో పైసలు పెట్టిరాంర్రి అంటూ మండలంలోని తుర్కపల్లిలో గురువారం రాత్రి డప్పు చాటింపు చేశారు. తుర్కపల్లి హన్‌మాన్ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీలోని డబ్బులు ఎత్తుకెళ్లారు. గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే గుడిలో హుండీ పైసలు ఎవరు ఎత్తుకెళ్లారో తెలుసని, ఎత్తుకెళ్లిన డబ్బులు గుడిలో పెట్టి రావాలంటూ డప్పు చాటింపు చేయించారు. లేకపోతే అపహరించిన వారు తెలుసని వారిని అందరి మధ్యలోకి పిలుస్తామంటూ చాటింపు వేయించారు.

వేములవాడ బార్‌కు ఇద్దరు అధ్యక్షులు

వేములవాడ: వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 9న బార్ అసోసియేషన్ హాల్‌లో జరగగా అధ్యక్ష పదవికి పోటీచేసిన గుండా రవి, గుడిసె సదానందంలకు చెరి 48 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారి ఇద్దరి అభ్యర్థులతో చర్చలు జరిపి ఎన్నికను ఎన్నికల అధికారి కేశన్నగారి గోపికృష్ణ వాయిదా వేశారు. గురువారం మరోసారి ఎన్నికల అధికారి ఇద్దరు సభ్యులతో సమావేశం నిర్వహించగా మొదటి ఆరునెలలు గుండా రవి, తర్వాత ఆరు నెలలు గుడిసె సదానందం పదవిలో కొనసాగేందుకు ఒప్పందం కుదిరింది. ఎన్నికల అధికారులు, అడ్వకేట్లు పాల్గొన్నారు.

- **పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి**

సిరిసిల్లటౌన్: పెంచిన చమురు ధరలకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టింది. తెలంగాణ చౌక్‌లో గ్యాస్ సిలిండర్‌తో నిరసన చేపట్టగా పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడంతో వినియోగదారులతోపాటు, ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏగమంటి ఎల్లారెడ్డి, పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- **సెస్‌లో వింత ధోరణి సరికాదు**

సిరిసిల్లటౌన్: సెస్ కార్యాలయంలో వింత ధోరణితో పాలకులు, అధికారులు నిబంధనలు విస్మరిస్తున్నారని సిరిసిల్ల పౌరసంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ విమర్శించారు. ఓ రిటైర్డ్ ఉద్యోగికి నెలకు రూ. 40,000 జీతం ఇస్తూ..కొత్తగా పోస్టును సృష్టించి చట్ట వ్యతిరేక నియామకం చేపట్టారని ఆరోపించారు. అసలు ఉద్యోగాల్లో సెస్ సంస్థలో ఇలాంటి పోస్టులే ఉండవన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగిని ఉద్యోగం నుంచి తక్షణమే తొలగించాలని సెస్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు.

- **ఉచిత శిక్షణ ప్రారంభం**

సిరిసిల్లకల్చరల్: పద్మశాలీ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) సారథ్యంలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించింది. శివనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఎంఈవో దూస రఘుపతి మాట్లాడారు. విశ్రాంత ఉపన్యాసకులు గాజుల ప్రతాప్ మాట్లాడారు. మే 10 వరకు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోపా ఉపాధ్యక్షుడు మామిడాల భూపతి. బైరి రవీందర్, ఊశకోయల మనోహర్, నవీన్, అంకారపు జ్ఞానోభ, సామల భూమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

- **సింహ గర్జనను వ్యతిరేకిస్తున్నాం**

వేములవాడ: సింహ గర్జనను నిర్వహించేందుకు ఈనెల 13న సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నారనీ, సింహగర్జన సమావేశాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని నియోజకవర్గ మున్నూరు కాపులు గురువారం వేములవాడలో ప్రకటించారు. రాష్ట్ర మున్నూరు కాపు అపెక్స్ కమిటీ చైర్మన్ ఆది శ్రీనివాస్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించడం సరికాదన్నారు. సింహగర్జనను వ్యతిరేకిస్తున్నట్లు సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. సమావేశంలో పట్టణ సంఘం అధ్యక్షుడు బింగి శ్రీనివాస్, తూర్పు సంఘం అధ్యక్షుడు కూరగాయల కొమురయ్య, నాయకులు నామాల పోచెట్టి, నామాల లక్ష్మీరాజం, పుల్కం రాజు, చిలుక రమేశ్, గోపు బాలరాజు, రైకనపేట క్రాంతి, ఎర్రం రాజు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: ఈనెల 13న జరిగే మున్నూరు కాపు సింహగర్జన సభను బహిష్కరిస్తున్నట్లు మండల మున్నూరుకాపు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి మాట్లాడుతూ మున్నూరు కాపు కులాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు తుంజలపతి, నాయకులు చెలుకల గంగధర్, కంటే నర్సయ్య, ఇప్ప నరేశ్, పాల్గొన్నారు.

- **తొలి పది నిమిషాలే రంగునీరు**

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం జరిగిన నీటి సరఫరాలో తొలి పది నిమిషాలు మాత్రమే రంగుమారిన నీరు వచ్చిందని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. పైపులైన్ లీకేజీల కారణంగానే ఇలా వచ్చిందని.. తర్వాత యథావిధిగా పరిశుభ్రమైన నీరు సరఫరా అయిందని స్పష్టం చేశారు. ‘మురుగునీరు సరఫరా’ శీర్షికతో గురువారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. పైపులైన్ లీకేజీలను మరమ్మతు చేసినట్లు వివరించారు. నీరు కలుషితం కాలేదని, పరిశుభ్రంగా ఉందని స్పష్టం చేశారు.

- **పైప్‌లైన్‌కు అనుమతివ్వం...**

వేములవాడ: రాజన్న గుడి చెరువును ఆనుకొని చేపడుతున్న మురుగునీటి మళ్లింపు పనులను రెండో రోజు భూయజమానులు గురువారం అడ్డుకున్నారు. ఇరిగేషన్ డీఈ ప్రశాంత్‌కుమార్, మున్సిపల్ ఏఈ నర్సింహస్వామి అక్కడికి చేరుకొని యజమానులతో మాట్లాడారు. తమ భూముల నుంచి పనులు చేపట్టనివ్వమని యజమానులు తేల్చి చెప్పారు. తగిన పరిహారం ఇచ్చిన తర్వాతే అనుమతిస్తామన్నారు. దీంతో అధికారులు పనులను వాయిదా వేశారు.

- **ద్విచక్రవాహనం చోరీ**

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన ఓలాద్రి నారాయణరెడ్డికి చెందిన బైక్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. తన ఇంటి ముందు పార్కుచేసి ఉంచిన వాహనం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. దీంతో నారాయణరెడ్డి పోలీసులకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- **గిరిజన నాయకుల ముందస్తు అరెస్ట్**

ముస్తాబాద్: మండలంలోని గిరిజన సంఘాల నాయకులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి గిరిజన నేతలు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

ఎల్లారెడ్డిపేట: చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న తెలంగాణ గిరిజన సంఘం నాయకులను గురువారం ఎల్లారెడ్డిపేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

కమిటీ ఎన్నిక

వేములవాడఅర్బన్: బీజేపీ వేములవాడ పట్టణ ఉపాధ్యక్షుడిగా మేర్గు లక్ష్మణ్, వేములవాడ పట్టణ ఓబీసీ మోర్చ కార్యదర్శిగా చిలివేరి పర్శరాములును నియమించారు. ఈమేరకు పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కోనరావుపేట: మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లైట్లు లేక రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు మంజూరు చేయించారు. పనులు పూర్తిచేసి ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు బిగించి లైట్లు ఏర్పాటు చేశారు.

సన్న బియ్యం పంపిణీ

గంభీరావుపేట: మల్లుపల్లిలో గురువారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, ఏఎంసీ డైరెక్టర్ గంగరాజుగౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా.

సిరిసిల్ల: జిల్లాలో ఇంటర్, పదోతరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో గురువారం సమీక్షించారు. ఈనెల 20 నుంచి ఇంటర్, పదోతరగతి ఓపెన్‌స్కూల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రశ్నాపత్రాలను, కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గుర్తింపు పొందిన వారిని తప్ప ఇతరులను కేంద్రాలకు అనుమతించరాదని ఆదేశించారు. సిరిసిల్ల 2, వేములవాడ 2 సెంటర్లలో 995 మంది పరీక్షలు రాస్తారని వివరించారు. 10వ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల కోసం సిరిసిల్లలో ఒక్క సెంటర్ ఉందని, 264 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఆర్డీవో రాధాబాయి, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా వైద్యాధికారి రజని పాల్గొన్నారు.

వరికోసిన రైతులకు టోకెన్లు అందజేయాలి

పంట కోసిన రైతులకు టోకెన్లు ఇచ్చి, కొనుగోళ్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని తేమశాతం గుర్తించి కొనుగోలు చేయాలని సూచించారు. డీఏవో అఫ్జల్‌బేగం, ఎల్‌డీఎం మల్లికార్జునరావు, జిల్లాలోని ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

కేజ్ కల్చర్ యూనిట్లు పరిశీలన

తంగళ్లపల్లి: మండల పరిధిలోని మిడ్‌మానేర్ బ్యాక్ వాటర్‌లో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన 18 కేజ్ కల్చర్‌బోనులను ఏర్పాటు చేయగా వాటిలో 4.2 లక్షల మత్స్య విత్తనాలను నిల్వ చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. నీటిమట్టం 8 టీఎంసీలు మాత్రమే ఉన్నందున ఎక్కువ బోనులను ఏర్పాటు చేయలేకపోతున్నామని నిర్వాహకులు తెలిపారు. జిల్లా ఫిషరీస్ అధికారి సౌజన్య తదితరలు ఉన్నారు.

వంద సెల్‌ఫోన్లను బాధితులకు అందించాం

- ఎస్పీ మహేష్ బీ గీతే



సిరిసిల్ల క్రైం: జిల్లాలో పలువురు పోగొట్టుకున్న, ఎత్తుకెళ్లిన సెల్‌ఫోన్లను పట్టించడంలో 84.1 శాతం రికవరీ ఉందని ఎస్పీ మహేష్ బీ గీతే జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన వంద సెల్‌ఫోన్లను బాధితులకు అందించినట్లు తెలిపారు. 1887 ఫోన్లు పోయినట్లు గుర్తించి 1587 రికవరీ చేశామన్నారు. సెల్ ఫోన్ దొంగతనాల నుంచి విముక్తి కల్పించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్ సీఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళి కృష్ణ, ఐటి కోర్ ఎస్ఐ కిరణ్ కుమార్, ఆర్‌ఐలు రమేశ్, యాదగిరి, ఎస్ఐ శ్రీకాంత్, ఐటీ కోర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం



ఎల్లారెడ్డిపేట: రాచర్ల గుండారంలో ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యంగా ఏఐసీసీ కోఆర్డినేటర్ అవీజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రాళ్లబావి, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో జై బాపు..జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని పలువార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాచర్లగుండారం నుంచి రాచర్లతిమ్మాపూర్ వరకు జై భీమ్.. జై సంవిధాన్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సుడిది రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, జిల్లా నాయకుడు చిలుక రమేశ్ ఆధ్వర్యంలో చిన్నలింగాపూర్, నర్సింహులపల్లె, బాలమల్లుపల్లె గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మాజీ ఎంపీటీసీ రాము, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట :

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కొలనూర్, రామన్నపేటలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చేర్మెన్ ప్రభాకర్, డైరెక్టర్లు నాయిని ప్రభాకర్ రెడ్డి, వెంకన్న జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టే రుక్మిణి, సత్యం, కర్రోళ్ల భాస్కర్, వీరవేణి తిరుపతి, నూగూరి గణేశ్, గ్రామ అధ్యక్షుడు కమలాకర్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ లు వివిధ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు హమీద్, ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, పాల్గొన్నారు.

సన్నబియ్యంతో సహపంక్తి భోజనాలు

మండలంలోని సముద్రలింగాపూర్‌లో గురువారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం నాయకులు ఎస్సీ కాలనీలో సహపంక్తి భోజనాలు చేశారు.